## ఆదివారం కథ

# చదువు రక్కసి



**- గోపరాజు నాగేశ్వరరావు**

పని మీద ఊరెళ్లి ప్రొద్దున్నే ఇంటికి రాగానే భార్యామణి ఉపన్యసించింది –

"యావండీ! ఈ చోద్యం విన్నారా? కిట్టూగాడు పరీక్షలో కాపీ కొడుతూ పట్టుబడ్డాట్ట. పైగా పట్టుకున్న పంతుల్నే కత్తితో పొడిచి చంపేట్ట..."

ఆశ్చర్యపోయేను!

హత్యలు, దోపిడీలు, బాంబుదాడులు, మానభంగాలూ నిత్యం వింటున్నవే అయినా కిట్టూగాడు పంతుల్ని హత్య చేసేడంటే నమ్మశక్యం అనిపించలేదు.

"నిజమా?" అడిగేను, ఆవిడ కళ్లలోకి చూస్తూ.

"నిజమేనండీ. పోలీసులు పట్టుకున్నారు కూడా. రేపో, మాపో కోర్టులో పెడ్తార్ట."

సూట్‌కేస్‌ను కింద పెట్టి సోఫాలో మౌనంగా కూచున్నాను.

కిట్టూగాడంటే ఎవరో కాదు. వాళ్లిల్లు మా ఇంటికి రెండిళ్ల అవతలే. మా కళ్లముందే పుట్టి పెరిగినవాడు కనక మనసంతా వికలమైపోయింది. వాడి మనస్తత్వం కూడా నాకు బాగా తెలుసు. ఎంతో నెమ్మదస్తుడు. చిన్నప్పటినించీ చదువు మీద తప్ప వాడి ధ్యాస మరి దేనిమీదికీ మళ్లేదే కాదు. ఎప్పుడూ ఆ ట్యూషన్లు, బడి, చదువూ, అలసిపోయి ఎప్పటికో నిద్రా... అంతే.

నాకు బాగా జ్ఞాపకం, చిన్నప్పుడు కిట్టూగాడు మా ఇంటి పక్కనే ట్యూషన్ చదివేవాడు. విచిత్రం ఏంటోకానీ ఆ ఇంట్లో తెల్లవారుఝామున ఐదు గంటలకే ట్యూషన్ మొదలయ్యేది.

నిద్రకళ్లతో, టీచర్ భయంతో మంచాల మీంచి దిగ్గున లేచి, ఇంకా విడీవిడని కనురెప్పల మధ్యనించి చికిలించి చూస్తూ చిన్న చిన్న పిల్లలు బరువైన సంచీలు భుజాలకు తగిలించుకుని చీకట్లోనే టీచర్ ఇంటికి వచ్చేవాళ్ళు. ఎ ఫర్ యాపిల్, ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్, – ఎప్పుడోకాని చైత్రము, వైశాఖమూ కూడా వినిపించేవి. మధ్య మధ్యలో సైన్సు, లెక్కలు, హిందీ...

నేను ఎంతగా ఆశ్చర్యపోయేవాడ్నో! అంత చిన్న పిల్లలకు 'యుద్ధ ప్రాతిపదిక మీద' విద్యనేర్పటం ఎందుకో అని.

ఎండాకాలం, సెలవుల్లో అనుకుంటా. ఒక రోజు పక్కింటి టీచరుగారు సాయంకాలం వేళ ఇంటి ముందున్న అరుగు మీద వెసులుబాటుగా కూచొని కనిపించేరు. నేనూ మా అరుగు మీద కూచున్నాను. ఎంతో కాలంగా వున్న సందేహాన్ని నివృత్తి చేసుకుందికి మాటలు కలిపి టీచర్ని అడిగేను –

"యావండీ! ఇంకా సరిగ్గా బొడ్డు కూడా ఊడని పసిబిడ్డల్ని తెల్లవారకముందే అలా చదువు పేర్తో ఎందుకు హింస పెడుతున్నారు?" అని.

జ్ఞాని అజ్ఞాని వేపు చూసినట్టు ఒకసారి నా వేపు చులకనగా చూసి ఆ మీదట నా అజ్ఞానాన్ని తొలగించేందుకు హామీ పడ్డ జ్ఞానిలా ప్రసన్నంగా మారి –

"వాళ్ళంతా ఎల్.కె.జి. పిల్లలు. మరి కొంచెం పెద్దయితే యు.కె.జి. కొస్తారు. ఇప్పుడే బాగా ఫౌండేషన్ పడకపోతే ముందు ముందు వాళ్ళకు ర్యాంకులెలా వస్తాయా?" అంది, ముఖం అటు వేపు తిప్పకుంటూ.

అనాడే నాకు అనిపించింది కదా, ఈ చిన్నారి పాపలిలా చీకటితోటే ట్యూషన్లకు వెళ్లటం, ఆ వెంటనే స్కూళ్లు, మధ్యాహ్నం నాలుగు మెతుకులు గతికి మళ్లీ సాయంత్రం ట్యూషన్లు, ఏ రాత్రికో నిద్ర కళ్ళతో ఇంటికి వెళ్లి మళ్లీ ప్రొద్దున్నే నిద్ర కళ్ళతో చదువుకుందికి వెళ్లటం...

ఇలా పెరిగితే పిల్లలకు అమ్మా, నాన్నా, అక్కా, చెల్లీ, అన్నా, దమ్ముడూ అనుబంధాలు ముడిపడే తీరికే వుండదు కదా. మానవ సంబంధాలు మనసుల్లో ఎలా మొగ్గతొడుగుతాయి?

సోఫాలో చేరగిలపడ్డ నాకు కిట్టూగాడు జ్ఞాపకం వచ్చేడు. వాడి బాల్యం మొత్తం నా కళ్ల ముందు మెదిలింది. వాడ్ని ఎ.బి.సి.డి.లు దిద్దించినప్పుడే వాళ్లమ్మా నాన్నా వాడు ఇంగ్లీషు మీడియంలో చదివి భవిష్యత్తులో గొప్ప డాక్టరు కావాలని కలలుకన్నారు. ఆ మీదట ఇంగ్లాండు వెళ్లి ఎఫ్.ఆర్.సి.యస్. కూడా అయితే సంఘంలో గౌరవంగా బ్రతకొచ్చనుకున్నారు. పైగా, బంధువులందర్లోకీ ఎఫ్.ఆర్.సి.ఎస్. అయిన వాడు కిట్టూగాడొక్కడే అయితే అందరూ ఎంతగా ఉడికిపోతారో!

అలాంటి భవిష్యత్తును ఊహించుకుంటూ కిట్టూ వాళ్ల అమ్మా, నాన్నా ఎంతగా సంబరపడిపోయేవాళ్ళో. ఆ సంబరం వాళ్ల మనసులకు మాత్రమే పరిమితమై సంతృప్తి కలిగించేది కాదు. అందర్తోనూ అదే పనిగా చెప్పకుంటేనే తప్ప!

వంటగదిలోకి వెళ్లొచ్చిన భార్యామణి కాఫీ కప్పుతో ఎదురుగా ప్రత్యక్షమైంది. "ఏమిటండీ! దీర్ఘంగా ఆలోచిస్తున్నారు?" కాఫీ అందిస్తూ అడిగింది కూడా.

కాఫీ కప్పు అందుకొని చప్పరిస్తూ శూన్యంలోకి చూస్తున్నానే కానీ భార్యామణికి ఎలాంటి సమాధానం చెప్పలేదు నేను. నా కళ్లలో కిట్టూగాడే మెదుల్తున్నాడు. వాడి రూపం వెనక అస్పష్టంగా మరేవో దృశ్యాలు కదిలిపోతో.

'ఆ అస్పష్ట దృశ్యాలే కిట్టూగాడ్ని ఆ క్షణంలో అంత రాక్షసోన్మాదిగా మారేందుకు ప్రేరేపకాలయ్యాయేమో!' – మనసంతా కంగాళీగా మారింది.

"ఇప్పుడే వస్తానోయ్" అని భార్యామణికి చెప్పి కిట్టూగాడింటికి బయల్దేరేను, వాళ్ల ఇంట్లోవాళ్లను పలుకరిద్దామని.

* * *

నేను కిట్టూ వాళ్లింటికి వెళ్లేసరికి ఆ ఇంట్లో వాతావరణం చాలా ఘోరంగా వుంది. అలాంటి స్థితిలో విషాదం మామూలే! వాళ్ల అమ్మా, నాన్నా చాలా కాలంగా జబ్బునపడిన వాళ్లలా కనిపించేరు.

కిట్టూవాళ్ల అమ్మయితే నేలలలుక్కుని మరీ ఏడుస్తోంది.

నన్ను చూడగానే ఆయన కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని, ముక్కుతో రెండుసార్లు బలంగా గాలి పీల్చి "కూర్చోండి" అన్నాడు గాద్గదికంగా.

నేను ఆయన ఎదురుగా కూచున్నాను. మాట్లాటం ఎలా, ఎక్కడ మొదలుపెట్టాలో అర్థంకాక మౌనం దాల్చేను.

రెండు క్షణాల తర్వాత కిట్టూ వాళ్ల నాన్నే అన్నారు –

"సార్! దయచేసి కొంచెం నాతో వస్తారా. కిట్టూకి బెయిల్ ఏర్పాట్లు చూడాలి. నాకు కాళ్లూ చేతులూ ఆడ్డంలేదు. కాస్త తోడుగా మీరుంటే..."

"దాందేముంది. తప్పకుండా..." అన్నాను ముక్తసరిగా. అప్పటిదాకా గంభీరంగా కూచున్న నాకు మాట్లాడే అవకాశం ఆయనే కల్పించేడు కనక, చొరవగా అడిగేను – "ఎలా జరిగిందండీ?" అని.

నేనడిగింది విన్నట్టుంది, కిట్టూ వాళ్ళమ్మ అక్కడికి సుడిగాల్లా వచ్చింది.

"జరిగిందేంటంటే, మా కిట్టూ ఎలాంటి వాడో మీకు తెలుసు కదా. అలాంటి వాడు కాపీ కొడతాడా మీరే చెప్పండి. ఎవడో ఆకతాయి పిల్లాడు మా కిట్టూను చూసి కన్ను కుట్టి కాపీ కాయితం వాడి సీటు దగ్గరికి విసిరేట్ట. అదీనూ ఇన్విజిలేటర్ వచ్చేప్పుడు. ఇంకేముంది, కిట్టూను పట్టుకుని డిబార్ చేసేట్ట. అదే చివరి పరీక్ష. ఆ ఒక్కటీ రాస్తే వాడికి ర్యాంకొచ్చేది. వాడు పరీక్షకు వెళ్లేప్పుడు కూడా వారూ, నేనూ ఇద్దరం చెప్పేం. బాగా రాయరా కిట్టూ! ర్యాంకు రాకపోతే ఎందుకూ పనికి రావు అని" అంటూ వచ్చే ఏడుపును బలవంతంగా ఆపుతూ "ఖర్మ యిలా కాలిందది. ఏం చేస్తాం" అని ఆవిడె పెద్దగా ఏడుస్తూ ఇంట్లోకి వెళ్ళిపోయింది.

నేనడిగింది ఆయన్నయితే మధ్యలో ఆమె అలా కల్పించకుని మాట్లాడంతో నాకేదో అనుమానం తట్టింది. భర్తల కన్నా తెలివిగల వాళ్లమన్న ఆత్మవిశ్వాసం చాలామంది ఆడవాళ్లకుండే మాట నిజమే అయినా ఇలా కల్పించుకుని

తమ తెలివితక్కువతనాన్ని తామే బయటేసుకుంటుంటారు. ఆ శాపమే వాళ్ళకు లేకపోతే సంసారాలు ఇంత సాఫీగా సాగవు కదా!

ఆయన వేపు తిరిగి అడిగేను – "అయినా ఇంత చిన్న విషయం హత్య దాకా ఎందుకొచ్చింది?" అని

ఆయన సమాధానం చెప్పకముందే ఆవిడే మళ్ళీ మా దగ్గరికి వచ్చింది. "కిట్టూగాడికి ర్యాంకొస్తుందని కళ్ళలో నిప్పులు పోసుకున్నారు. కక్ష కట్టి డిబార్ చేసేరు. వాడు కూడా జీవితం వృథా అయిందన్న కోపంతో పొడిచి చంపాడు" చెప్పిందామె.

వాళ్ళతో మట్లాడబుద్ధి కాలేదు నాకు. లేచి నించున్నాను. ఆయన కూడా లేస్తూ "వెళ్దామా సార్?" అన్నాడు.

ఇద్దరం మౌనంగా బయటికి దారి తీసేం.

* * *

ప్లీడర్తో మాట్లాడి, కిట్టూ విషయంలో కోర్టువారినెలా నమ్మించాలో, విచారణ ఎలా వున్నా ప్రస్తుతం బెయిలు ఎలా పొందాలో అంతా వివరంగా మాట్లాడి, ఫీజులో సగం ఎడ్వాన్స్ కూడా చెల్లించి బయటపడ్డాం.

లాకప్‌లో వున్న కిట్టూను చూడాలనిపించింది ఆయనకు.

నాక్కూడానూ...

ఇద్దరం పోలీసు స్టేషన్‌కు వెళ్లేం.

కిట్టూను చూసేందుకు అంతగా అభ్యంతరాలేం ఎదురవ్వలేదు.

సెల్‌లో ఒక మూలగా గోడకు చేరగిలబడి కనిపించేడు కిట్టూ. ముఖమంతా బాగా పీక్కుపోయింది. మాసిపోయిన బట్టల్లో – భూగోళపు మనుషులకు చిక్కిన గ్రహాంతర వాసికి మల్లే శూన్యంలోకి చూస్తూ కూచున్నాడు.

"బాబూ... కిట్టూ!" గొంతు పెగల్చుకుని కటకటాల్లోంచి పిల్చేరాయన.

కిట్టూ ఆ పిలుపుకు ఇహలోకంలోకొచ్చి 'చప్పున పైకి లేచి, రెండే రెండంగల్లో కటకటాల దగ్గరికి వస్తూ "డేడ్! ఐ మిస్డ్ ది ర్యాంక్. సారీ డేడ్..." అన్నాడు దీనంగా.

ఆయన కటకటాల్లోంచి చెయ్యి లోపలికి దూర్చి, కిట్టూ భుజం మీద ఆప్యాయంగా రెండుసార్లు తట్టి, కిట్టూ తన కన్నీళ్లు చూడకూడదనుకుని కాబోలు దూరంగా వెళ్లి నించున్నాడు.

"అంకుల్! ఐ మిస్డ్ ది ర్యాంక్" కిట్టూ నా వేపు చూస్తూ అన్నాడు మళ్లీ.

'యు హేవ్ మిస్డ్ నాటోన్లీ ది ర్యాంక్ కిట్టూ! యువర్ ప్రాస్పరస్ లైఫ్ ఆల్సో..." అన్నాను, భావోద్వేగాన్ని భరాయించలేక.

కిట్టూ నా వేపు అయోమయంగా చూసేడు.

"నిజంగా కాపీ కొట్టావా కిట్టూ?" వాడి కళ్లలోకి చూసిన నా చూపుల తీవ్రతకు వాడు కళ్లు వాల్చేస్తూ అంగీకారంగా తలూపేడు.

"మరి తప్పు నీది కదా ఇన్విజిలేటర్ పట్టుకుంటే ఎందుకు హత్య చేసేవ్?" తీక్షణంగానే అడిగేను.

వాడు పెద్దగా ఏడ్చేడు.

కొంచెం సేపు అలా ఏడ్వనిచ్చి "మౌనం సమాధానం కాదు కిట్టూ. నాక్కావాల్సింది నిజం" అన్నాడు కోపంగా.

కిట్టూ ప్రయత్నం మీద ఏడుపు దిగమింగుకున్నాడు. "అంకుల్! మమ్మీ, డేడీ నన్ను డాక్టర్ని చెయ్యాలనుకున్నారు. ర్యాంకులు కావాలన్నారు. వాళ్ల ఆలోచన ఎప్పుడూ నా ర్యాంకుల మీదే. అలాంటిది ర్యాంకు రాకపోతే ముఖం ఎలా చూపించను? చివరి పరీక్షలో మాకు చెప్పని నాలుగు ప్రశ్నలొచ్చేయి. అవి రాయకపోతే ర్యాంకు రాదు. అందుకే కాపీ..." వాడు తన భావాన్ని నేను గ్రహించగలననుకుని కాబోలు మాటల్ని మధ్యలోనే త్రుంచేసేడు.

"ఇంత అమాయకుడివి హత్య ఎలా చేసేవ్?" అడిగేను.

కిట్టూ ముఖంలో నీలినీడలు పులుముకున్నాయి. ఒక్క క్షణం తటపటాయించి ఆ పైన "డిబార్ చెయ్యగానే కాలేజి నించి ఇంటికి వెళ్లబుద్ధికాలేదు. అందుకే ఏం చెయ్యాలో తోచక సినిమాకు వెళ్లేను. తెర మీద విలన్ కనిపించగానే హాల్లో ఎన్ని చప్పట్లో. సినిమా అంతా హత్యలే అంకుల్. నాకూ అనిపించింది, నన్ను డిబార్ చేసిన పంతుల్ని కూడా అలా కత్తితో పొడిచి చంపేద్దామని. సినిమా మధ్యలోనే వచ్చేసేను. పంతుల్ని పొడిచి చంపేను..."

"నీకు కత్తి ఎక్కడ దొరికింది?"

"మా కాలేజీలో స్టూడెంట్స్ యూనియన్లు చాలా వున్నాయి. యూనియన్ లీడర్లందరి దగ్గరా కత్తులుంటాయంకుల్. ఒక లీడర్ని అడిగి తెచ్చుకున్నాను."

"సార్! మీరిక వెళ్లండి. డి.ఎస్పీ. దొరగారొస్తున్నారట" అన్న కానిస్టేబుల్ మాటలు వినిపించి భారంగా అక్కడ్నించి వెనక్కు తిరిగేం.

దార్లో, నా ఆలోచనల నిండా కిట్టూనే నిండిపోయేడు.

ఎందుకోగాని కిట్టూకి శిక్ష పట్టం ఖాయం అని నా మనసు పదేపదే చెప్తోంది. అయినా ఇంకా చాలామంది నేరస్తులు తప్పించుకుంటున్నారనే నా బాధంతా.

కేవలం ర్యాంకుల సాధనే జీవిత పరమార్థంగా కిట్టూను చదువులు చదివే యంత్రంగా మార్చిన మమ్మీ, డేడీ, పసితనంలోనే చదువు పేర్తో హింసపెట్టి ఆ పసి మనసులో మానవత్వం మొగ్గతొడగనీయకుండా అనుక్షణం ర్యాంకుల్నే నూరిపోసిన పక్కింటి పంతులమ్మా, చెప్పే పాఠాలకూ ఇచ్చే ప్రశ్నలకూ పొంతన లేని విద్యా వ్యవస్థ, తోటి విద్యార్థుల చదువునూ, ఉన్నత ఆదర్శాలనూ ఆదిలోనే గొంతు నులిమి చంపి నాయకత్వం కోసం విద్యార్థి దశలోనే కత్తులతో సంఘాలు నిర్మించే విద్యార్థి నాయకులూ, వాళ్లను తమ పబ్బానికి వాడుకునే రాజకీయ రాబందులూ, తెల్లకాయితాల్లాంటి పసి మనసుల మీద నెత్తుటి బొమ్మలు గీస్తూ హింస, క్రౌర్యం, దౌర్జన్యం నరాలకు దట్టిస్తోన్న చలనచిత్రాలూ, – నాలో మెదుల్తోన్న కిట్టూ వెనక మసక మసగ్గా...

చుట్టూ రక్కసి పొదలు. మధ్యన దీనంగా కిట్టూ!

ఒక్క హత్య వెనక ఎంతమంది నేరస్తులో.